సాక్షి
హనుమకొండ
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



సీబీసీ..రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చి

131 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి నేడు (మంగళవారం) ప్రారంభం కానుంది. - 8లో▸



టైరు పేలింది.. పల్టీ కొట్టింది

యశ్వంతాపూర్ శివారులో ప్రైవేట్ ట్రావెల్ బస్సు టైరు పేలి బోల్తా పడింది. బస్సులోని 15 మంది గాయపడ్డారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$34^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆర్ట్స్‌కాలేజీ మైదానంలో వారంపాటు ఆటలు ఆడొద్దు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ మైదానంలో క్రికెట్, ఇతర ఆటలను వారం రోజులపాటు ఆడొద్దని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదానంలో గడ్డి నివారణ మందును పిచికారీ చేయించామని, దీంతో గ్రౌండ్‌కు వచ్చేవారు గమనించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గేదెలు, ఇతర జంతువులను కూడా మైదానంలోకి పంపొద్దని సూచించారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా ఫణీందర్



కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా దాసరి ఫణీందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా జిల్లా ఆడిట్ విభాగంలో జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఫణీందర్‌ను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేయగా, ఆడిట్ విభాగం ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా డీఐజీ సుభాషిణికి అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఫణీందర్‌కు చిట్స్ సహాయ రిజిస్ట్రార్ యామిని, సబ్ రిజిస్ట్రార్లు రామనరసింహారావు, ఆనంద్, సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మత్తుపదార్థాల నియంత్రణకు చర్యలు



హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లావ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తుపదార్థాల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) వై.వి గణేష్ తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణపై సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ సమావేశం నిర్వహించారు. నెల రోజులుగా మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకున్న చర్యలు, ముందస్తు ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్‌కే సలీమా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, డీఐఈఓ గోపాల్, పరకాల ఆర్డీఓ నారాయణ, నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు, కాజీపేట ఏసీపీ తిరుమల్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీ సేవలు స్ఫూర్తిదాయకం



వరంగల్ క్రైం : ఎన్నో త్యాగాలు, కష్టనష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న పోలీస్ అధికారుల సేవలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్సైలు సయ్యద్ యూసుఫ్, కుమారస్వామిలను సోమవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అండర్ -14,16,18,20 బాలబాలికల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలను టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం సీఐ రాజు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు. వరంగల్ జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఊర యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 30మంది క్రీడాకారులను ఈ నెల 7, 8 తేదీల్లో జేఎన్‌ఎస్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు సాంబమూర్తి, రజనీకాంత్, వాసుదేవరావు, మనోజ్, రంజిత్, కృష్ణమూర్తి, మహేందర్, నాగరాజు, భారతి, దేవేందర్, డీఎస్‌ఏ కోచ్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిలో నెగ్గేదెవరో?



కఠోర తపస్సు.. పట్టు సడలని ఏకాగ్రత.. నిద్రలేని రాత్రులు.. పొద్దు తెలియని రోజులు.. ఎన్నో కష్టనష్టాలు.. మరెన్నో ఇబ్బందులు అన్నింటినీ దాటుకొని చివరి మెట్టుకు చేరుకున్నారు డీఎస్సీ అభ్యర్థులు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలతో ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నేడు(మంగళవారం) నిర్వహించనున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఒక్కో పోస్టుకు ముగ్గురిని పిలిచారు. ఆ ముగ్గురిలో నెగ్గేదెవరో.. కొలువు కొట్టేదెవరో వేచి చూడాల్సిందే..

- విద్యారణ్యపురి

డీఎస్సీ ఫలితాల వెల్లడి.. ఒక్కో పోస్టుకు ముగ్గురికి పిలుపు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,519 టీచర్ పోస్టులు
- అత్యధికంగా మహబూబాబాద్‌లో 381
- అత్యల్పంగా హనుమకొండ జిల్లాలో 187
- నేటినుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థుల కల సాకారం అవనుంది. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీకి ఈఏడాది మార్చి 1 డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చి జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తం 2.45 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,519 టీచర్ల పోస్టులకు వేలాది మంది పోటీపడ్డారు. ఈనెల 9న హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం. డీఎస్సీ మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం ఎంపిక జాబితాలను మంగళవారం రాత్రి డీఈఓలకు విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి పంపనున్నారు. ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తున్నారు.

నేటినుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డీఈఓలు అక్టోబర్ 1 నుంచి 5 వరకు డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లాలోని అభ్యర్థులకు డీఈఓ కార్యాలయం పక్కన సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగనుంది. ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. ఆయా జిల్లాల్లోని మెరిట్ జాబితాను సంబంధిత డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ సైన్ చేయించుకుని, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు తీసుకుని రావాల్సి ఉంటుంది. కాగా.. ఎంపికైన అభ్యర్థి సుముఖత లేకపోతే వేరే అభ్యర్థిని ఎంపిక చేసే వీలుంటుందని ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను పిలుస్తున్నారు.

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు..

- హనుమకొండ జిల్లాలో ఎస్‌ఏ 73, ఎల్‌పీ 5, పీఈటీ 7, ఎస్జీటీలు 81, ఎస్‌ఏ స్పెషల్ 4, ఎస్జీటీ స్పెషల్ 17, మొత్తం 187 పోస్టులకు ఎంపిక చేస్తారు.
- జనగామ జిల్లాలో ఎస్‌ఏ 50, ఎల్‌పీ 21, పీఈటీ 7, ఎస్జీటీ 118, ఎస్‌ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 20 మొత్తం 221 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎస్‌ఏ 41, ఎల్‌పీ 20, పీఈటీ 7, ఎస్జీటీ 152, ఎస్‌ఏ స్పెషల్ 4, ఎస్జీటీ స్పెషల్ 13, మొత్తం 237 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.
- మహబూబాబాద్ జిల్లాలో ఎస్‌ఏ 71, ఎల్‌పీ 19, పీఈటీ 2, ఎస్జీటీ 264, ఎస్‌ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 20 మొత్తం 381 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ములుగు జిల్లాలో ఎస్‌ఏ 33, ఎల్‌పీ 16, పీఈటీ 1, ఎస్జీటీ 125, ఎస్‌ఏ స్పెషల్ 3, ఎస్జీటీ స్పెషల్ 14 మొత్తం 192 పోస్టుల్లో ఎంపిక చేస్తారు.
- వరంగల్ జిల్లాలో ఎస్‌ఏ 66, ఎల్పీ 21, పీఈటీ 6, ఎస్జీటీ 182, ఎస్‌ఏ స్పెషల్ 5, ఎస్జీటీ స్పెషల్ 21 మొత్తం 301 పోస్టుల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు ఉద్యోగాలకు ఎంపిక



వేలేరు: ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో పట్టుదలతో చదివి ఓ యువకుడు ఏకంగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన సోన్నాయిల రాజు–స్వరూపల కుమారుడు రాహుల్ సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా మొదటి ర్యాంక్, ఎస్‌జీటీలో జిల్లా నాలుగో ర్యాంకు సాధించాడు. ప్రణాళికతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించినట్లు రాహుల్ తెలిపాడు.

ప్రజా గ్రంథాలయంనుంచే ప్రిపరేషన్



ఎల్కతుర్తి : మాది భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామం. మా నాన్న అశోక్ స్థానికంగా కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటారు. నన్ను కష్టపడి చదివించాడు. స్థానిక ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో నాలుగేళ్లనుంచి ప్రిపరేషన్ అయ్యాను. శ్రీనివాస్, వీరేశం, తిరుపతి, ప్రమోద్‌రెడ్డి సార్లు, నా తోటి మిత్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు.

- కటకం రాజ్‌కుమార్, ఎస్‌జీటీ, పదవ ర్యాంక్

నేటి ఉదయం వరకు వెబ్‌సైట్‌లో జాబితా : డీఈఓలు

డీఎస్సీలో ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున అభ్యర్థుల ఎంపిక జాబితాను ఆయా జిల్లాల వెబ్‌సైట్‌లో మంగళవారం ఉదయం వరకు అందుబాటులో ఉంటుందని హనుమకొండ, వరంగల్ డీఈఓలు వాసంతి, జ్ఞానేశ్వర్లు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. డీఎస్సీకి దరఖాస్తు చేసినప్పుడు జత పర్చిన ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని వెరిఫికేషన్‌కు రావాల్సింటుందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వరంగల్ జిల్లాకు సంబంధించి డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పేర్కొన్న చెక్‌లిస్టు ప్రకారం సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. మంగళవారం నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరగనుంది.

కొలువు కొట్టారు.. : ర్యాంకర్ల మనోగతం - 8లో▸

జిల్లాలు →	హనుమకొండ	వరంగల్	జనగామ	భూపాలపల్లి	ములుగు	మహబూబాబాద్
మొత్తం పోస్టులు	187	301	221	237	192	381
సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచిన అభ్యర్థులు	561	903	663	711	576	1,143

విద్యార్థినులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య



విద్యార్థులకు ఆరోగ్య కార్డులు అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

ఐనవోలు : విద్యార్థినులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఆరోగ్య కిట్ల పంపిణీ, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్యనభ్యసిస్తున్నామంటే ప్రజలు చెల్లించిన పన్నుల నుంచి ఖర్చు చేసి చదివిస్తున్నట్లు అని చెప్పారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కేజీబీవీలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు తమ సమస్యలను పేపర్‌పై రాసి అందులో వేయాలన్నారు. మళ్లీ పాఠశాలను విజిట్ చేసినపుడు వాటిని పరిష్కరిస్తానన్నారు. బాలికలు ఆడుకోవడానికి రూ.40 వేల విలువగల స్పోర్ట్స్ కిట్‌ను అందజేసినట్లు తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ బాలికలకు హెల్త్ కార్డులు అందించడం మంచి నిర్ణయం అన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బాలికలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు వెంటనే వైద్యం పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, డీఎంహెచ్‌ఓ లలితాదేవి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

గుడి కడితే బిచ్చగాళ్లు తయారవుతారు..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'నాకు అంబేడ్కరే ఆదర్శం. నేను గుడి కంటే బడికే ప్రాధాన్యత ఇస్తా. బడి కడితే మేధావులు తయారవుతారు.. గుడి కడితే బిచ్చగాళ్లు తయారవుతారు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో హాజరైన పలువురు ఎమ్మెల్యే స్థాయిలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే వెనుకబడిన ఓ రెండు కులాల విషయంలో నోరుజారి వివాదంలో ఉన్న ఎమ్మెల్యే మరోసారి నోరుజారడం గమనార్హం. ఇలా వ్యాఖ్యలు చేసిన అనంతరం ఎంపీ కావ్యతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు మల్లికార్జునస్వామిని దర్శించుకోవడం గమనార్హం.

పారదర్శకంగా రుణాలు అందిస్తున్నాం



సొసైటీ మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రవీందర్‌రావు

ఐనవోలు : నందనం సొసైటీని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో విలీనం చేసిన తర్వాతే పురోగతి సాధించిందని వరంగల్ డీసీసీ బ్యాంకు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్పష్టం చేశారు. సామాన్య రైతు ఎవరికి కమీషన్లు ఇవ్వకుండా నేరుగా సొసైటీ, డీసీసీబ్యాంకు బ్రాంచ్‌ల్లో సంప్రదిస్తే అత్యంత పారదర్శకంగా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సోమవారం నందనం సొసైటీ ఆధ్వర్యంలో అదే గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ మార్టును ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నందనం రైతు సేవా సహకార సంఘంలో 52వ మహాజన సభ సమావేశం సంఘం ఉపాధ్యక్షుడు తక్కళ్లపెల్లి చందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ సీఈఓ సంపత్‌కుమార్ ఆరు నెలల ప్రగతి నివేదికను రైతులకు చదివి వినిపించారు. అనంతరం మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా నందనం సొసైటీ పనిచేస్తోందన్నారు. వ్యవసాయ భూమి మాత్రమే ఉన్న రైతు కొడుకు విదేశాల్లో చదవాలంటే గతంలో రుణాలు ఇచ్చే బ్యాంకులే లేవన్నారు. డీసీసీ బ్యాంకు ఒక్కటే వ్యవసాయ భూములపై విదేశీ రుణాలు అందిస్తుందన్నారు. రుణాలు పొందిన రైతులు తమకు ఇచ్చిన గడువులోగా రుణాలు తిరిగి చెల్లిస్తే అపరాధ రుసుం వసూలు చేయరన్నారు. అనంతరం రైతులకు సొసైటీ ద్వారా మంజూరైన కర్షక మిత్ర మార్టిగేజ్ రుణాలకు సంబంధించిన రూ.56 లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేశారు.

సొసైటీ సీఈఓపై డైరెక్టర్ ఆగ్రహం

నందనం సొసైటీ సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌పై డైరెక్టర్ మేట చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈఓ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని, విధులు సరిగా నిర్వర్తించని సీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, బాబు, పద్మ, ఎలేంద్ర, రాంచంద్రం, చిరంజీవి, రాజ్‌కుమార్, నోడల్ ఆఫీసర్, బ్యాంకు మేనేజర్, బ్యాంకు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అందరు ఆరోగ్యంగా ఉండాలి


సైబరాబాద్ అడిషనల్ డీసీపీ పుల్ల శోభన్



మాట్లాడుతున్న శోభన్‌కుమార్

కమలాపూర్ : అందరు ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ధ్యేయమని సైబరాబాద్ అడిషనల్ డీసీపీ పుల్ల శోభన్‌కుమార్ అన్నారు. పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో సోమవారం కమలాపూర్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి స్వయంగా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏకశిల, లక్ష్మీనరసింహ, భద్రకాళి ఆస్పత్రి వైద్యులు 900 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభన్‌కుమార్ మాట్లాడుతూ పుల్ల వంశస్తుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్పీ పుల్ల సంజీవరావు, సీఐ హరికృష్ణ, ఎంపీడీఓ గుండె బాబు, ఏకశిల, లక్ష్మీనరసింహ, భద్రకాళి ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న అధికారులు

శాయంపేట : శాయంపేటకు చెందిన రైతు గడ్డం సంజీవ్ సోమవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావిలో కొండచిలువ కనిపించడంతో ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారపల్లి సునీల్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో సునీల్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా బీట్ ఆఫీసర్ రతన్‌లాల్‌తోపాటు జూపార్క్ సిబ్బంది అక్కడికి చేరుకొని బావిలోని కొండచిలువను సురక్షితంగా బయటికి తీశారు. అనంతరం అడవిలో వదిలివేయడానికి తీసుకెళ్లారు.

వాగ్వాదాలు.. తోపులాట

నయీంనగర్ బ్రిడ్జి వద్ద తీవ్ర ఉద్రిక్తత

- బీఆర్‌ఎస్ చేసిన పనులను కాంగ్రెస్ చేసిందనడం సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు
- బ్రిడ్జి వద్దకు మేయర్ సుధారాణితోపాటు కాంగ్రెస్ శ్రేణుల రాక..
- ఇరు పార్టీల శ్రేణుల పరస్పర నినాదాలు
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు
- వినయ్‌తోపాటు పలువురి అరెస్ట్..





తోపులాడుకుంటున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు, రోడ్డుపై బైఠాయించిన వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి



వినయ్‌భాస్కర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

నయీంనగర్/హన్మకొండ : హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి ప్రాంతం రణరంగంగా మారింది. బ్రిడ్జిని తమ హయాంలో కట్టామంటే.. తమ హయాంలోనే నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయని కొద్దిరోజులుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నయీంనగర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. బ్రిడ్జిని పరిశీలించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నయీంనగర్ బ్రిడ్జికి నిధుల కేటాయింపు, 90శాతం పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయని, ఇంత పెద్ద నాలా, బ్రిడ్జి పనులు ఆరు నెలల్లో సాధ్యమేనా అని ప్రశ్నించారు. మేస్త్రీ భవనం కట్టినంత మాత్రాన యజమాని కాడని, బీఆర్‌ఎస్ చేసినా పనులను మేమే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ విషయం తెలుసుకున్న నగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ నాయకులు, పలువురు కార్పొరేటర్లు సైతం బహిరంగ విచారణకు వస్తామంటూ నయీంనగర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని ఒకవైపు కాంగ్రెస్ నాయకులు, మరోవైపు జై తెలంగాణ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు పరస్పరం నినాదాలు చేశారు. వినయ్ భాస్కర్, నాయకులు, కార్యకర్తలు అక్కడి నుండి వెళ్లిపోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. తామెందుకు వెళ్లాలని బీఆర్‌ఎస్ శ్రేణులు అనడంతో కొందరు తోపులాడుకుంటూ ముందుకు వచ్చారు. ఇరువర్గాలు కొంతసేపు వాగ్వాదాలు చేసుకుంటూ తోపులాడుకున్నాయి. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అప్పటికే పోలీసులు అదనంగా బలగాలను మోహరించారు. మాజీ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కూడా బీఆర్‌ఎస్ కార్యకర్తలు వినయ్ భాస్కర్ అరెస్టును అడ్డుకుంటూ రోడ్డుపై ధర్నాకు దిగగా పోలీసులు చెదరగొట్టారు. వినయభాస్కర్‌తోపాటు మాజీ 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌లతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని మొదట నగరంలోనే బస్సుల్లో తిప్పిన పోలీసులు.. ఆ తర్వాత హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపైన విడుదల చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే బ్రిడ్జి పూర్తి : మేయర్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతోనే యుద్ధ ప్రాతిపదికన నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని బల్దియా మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం నయీంనగర్ బ్రిడ్జిపై మీడియాతో మేయర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిధులు వచ్చి తిరిగి వెళ్లగా సీఎం రేవంత్‌రెడ్డి కృషితో మళ్లీ వచ్చాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాయకులు నిధులు వాడుకొని బ్రిడ్జి నిర్మాణం చేస్తే అప్పుడే పూర్తయ్యేదన్నారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ప్రతిరోజూ బ్రిడ్జి పనులను పర్యవేక్షించడం, మేయర్, కలెక్టర్, కమిషనర్, ఇతర అధికారుల సమన్వయం వల్ల యుద్ధప్రాతిపదికన బ్రిడి నిర్మాణమైందన్నారు.

దాడులు చేయడం మంచి సంప్రదాయం కాదు: దాస్యం వినయ్‌భాస్కర్

ప్రతిపక్షాలపై దాడులు చేయడం మంచి సంప్రదాయం కాదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం నయీంనగర్ బ్రిడ్జిపై, అనంతరం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము నయీంనగర్ నాలా బ్రిడ్జి వద్ద జీఓలు చూపిస్తు వివరిస్తుండగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నాలుగు వైపుల నుంచి దాడి చేశారన్నారు. ఈ దాడిలో తమ మహిళ కార్యకర్త తస్లీమా గాయపడ్డదని తెలిపారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో మంచిది కాదని సూచించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి దాడులు ప్రోత్సహించలేదన్నారు. మిత్రుడు నాయిని రాజేందర్ రెడ్డి వెకిలి మాటలు, వెకిలి చేష్టలు చేస్తున్నారని విమర్శించారు. చీరలు, గాజులు తీసుకురావడం ఇదెక్కడి సంప్రదాయమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు మీకు పోలికా అని పశ్నించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, నగర అభివృద్ధికి, ఐటీ కంపెనీలు రావడానికి కృషి చేశారన్నారు. మీరు ఎప్పుడు గెలిచారు... ఎన్ని నిధులు తీసుకువచ్చారు... ఏమయే అభివృద్ధి పనులు చేపట్టారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలవగానే నాలుగు సార్లు ఢిల్లీకి, అమెరికా, ఆస్ట్రేలియాకు దోచుకున్నవి దాచుకోవడానికి వెళ్లలేదని నాయినికి చురకలంటించారు. నయీంనగర్ నాలాపై నిర్మించిన వంతెన డిజైన్‌లో లోపం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పెద్దమ్మగడ్డ శ్మశానవాటిక ప్రహరీ కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద కేసు నమోదు చేయించాలని, 48 గంటల్లో ఆ గోడ నిర్మించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని డిమాండ్ చేశారు. సమావేశంలో టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, నాయకులు పులి రజనీకాంత్, మసూద్, సంకు నర్సింగ్, సోదా కిరణ్, నార్లగిరి రమేష్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

అవార్డులు ప్రతిష్టను పెంపొందిస్తాయి



వరంగల్ అర్బన్ : అవార్డులు నగర ప్రతిష్టను పెంపొందిస్తాయని, అధికారులు, ఉద్యోగుల్లో మనోధైర్యాన్ని కల్పిస్తాయని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహమంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) నిర్వహించిన నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ)పోటీల్లో స్మార్ట్ సిటీ నగరాల్లో టాప్–5లో గ్రేటర్ వరంగల్ నగరం ఎంపికైంది. ఢిల్లీలో పొందిన ఎక్సలెన్స్ సర్టిఫికెట్‌ను అందుకున్న ఇంజనీర్లు మేయర్ గుండు సుధారాణికి అవార్డు, సర్టిఫికెట్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు దక్కడానికి విశేషంగా కృషి చేసిన ఇంజ నీరింగ్ అధికారులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీని వాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగా రా వు, ఏఈలు హరికుమార్, కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

వరంగల్: న్యాయవాదులకు రక్షణ కల్పించాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎండీ ముదస్సర్ అహ్మద్ ఖయ్యూమ్ కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ కోర్టు ఆవరణలో హింసాత్మక చర్యలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. న్యాయవాదులు చట్టవిరుద్ధమైన విధానాలను ప్రశ్నించడానికి, నిందితుల హక్కుల పరిరక్షణకు పోలీస్‌స్టేషన్‌లను సందర్శించినప్పుడు భౌతిక దాడులకు గురవుతున్నామన్నారు.

హక్కుల కోసం పోరాడాలి



వరంగల్ చౌరస్తా : పాలకులు మహిళలకు సమాన హక్కులు కల్పించకుండా అణచి వేస్తున్నారని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ కేంద్ర కమిటీ సభ్యురాలు కుంభం సుకన్య విమర్శించారు. సోమవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర ప్లీనరీ వస్కుల సైదమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సుకన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా ఐక్య పోరాటాల ద్వారా స్వేచ్ఛ, సమానత్వం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ ప్లీనరీలో రాష్ట్ర అధ్యక్షురాలు అంగడి పుష్ప, ప్రధాన కార్యదర్శి రాగ సుధ, కోశాధికారి తాండ్ర కళావతి, తదితరులు పాల్గొన్నారు.

కొలువు కొట్టారు



ప్రస్తుత కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఆషామాషీ కాదు. పోస్టులు పదుల్లో ఉంటే.. దరఖాస్తులు లక్షల్లో ఉంటున్నాయి. పోటీ తీవ్రంగా ఉంటుంది. అయినా ఏమాత్రం ఆందోళనకు గురికాకుండా లక్ష్యం విధించుకున్నారు. లక్ష్య సాధనలో ఎన్నో ఆటంకాలు, మరెన్నో ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో ముందుకు సాగారు. నిరంతరం పట్టుదలతో చదివి విజేతలుగా నిలిచారు. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు ఎంపికయ్యారు.

ఎస్జీటీలో అరుణ్‌కుమార్ జిల్లా టాపర్



మోటపోతుల అరుణ్‌కుమార్

ములుగు రూరల్: డీఎస్సీ ఫలితాలలో ములుగు జిల్లా అబ్బాపూర్ గ్రామానికి చెందిన మోటపోతుల అరుణ్‌కుమార్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. తెలుగు సెంకడరీ గ్రేడ్ టీచర్ పోస్టుల విభాగంలో 81.63శాతం మార్కులు సాధించి డీఎస్సీ జనరల్ ర్యాంకు లిస్టులో ప్రథమ స్థానంలో నిలిచారు. అబ్బాపూర్ గ్రామానికి చెందిన మోటపోతుల రాణి –ఆనంద్‌గౌడ్ దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్. కాగా, తండ్రి మృతి చెందిన 12వ రోజు డీఎస్సీకి హాజరైన అరుణ్‌కుమార్ మొక్కవోని దీక్షతో పరీక్ష రాసి ర్యాంకు సాధించాడు. దీనిపై గ్రామస్తులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అరుణ్‌కుమార్‌ను అభినందించారు.

డీఎస్సీ ఫలితాల్లో నరేశ్ ప్రతిభ..



నరేశ్

బయ్యారం: డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విభాగంలో మండలంలోని కస్తూరినగర్ గ్రామానికి చెందిన మాలోత్ నరేశ్ మొదటిస్థానం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన నరేశ్.. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని నిజాం కళాశాలలో డిగ్రీ, తొర్రూరు డీఆర్ఎస్ కళాశాలలో బీఈడీ, భద్రాచలంలో డీఈడీ విద్యనభ్యసించాడు. అదేవిధంగా ఎస్జీటీ విభాగంలో ఎస్టీ కేటగిరీలో నరేశ్ మొదటిస్థానం సాధించాడు. స్కూల్‌అసిస్టెంట్, ఎస్జీటీ విభాగాల్లో మొదటిస్థానం సాధించిన నరేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

తొర్రూరు వాసికి 3వ ర్యాంకు



దొంతోజు గీత

తొర్రూరు రూరల్: తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన దొంతోజు గీత డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. దీంతో పాటు భాషా పండితుల విభాగంలో జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఆమె మహబూబాబాద్‌లోని బీసీ గురుకులంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. అలాగే, మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన వల్లపు యాకయ్య స్కూల్ అసిస్టెంట్ బయాలజీ విభాగంలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు.

కష్టానికి ఫలితం దక్కింది..



నా చిన్న తనంలో తండ్రి చనిపోయారు. మేము మత్స్యకారులం. చాపలు పట్టుకుంటూ, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. డిగ్రీ, బీఈడీ పూర్తి కాగానే విద్యావలంటరీగా పని చేశా. ఆ పోస్టు కూడా రద్దు కావడంతో ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని దృఢ లక్ష్యంతో మూడు సంవత్సరాలు కష్టపడి చదివా. 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో తెలుగులో ఫస్ట్ ర్యాంకు సాధించా. –మహబూబాబాద్ అర్బన్

– బండారి నరేశ్, నర్సింహులగూడెం, నెల్లికుదురు మండలం

నాకు నాన్న ఆదర్శం..



నాన్న తాపీ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నేను ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతగా కష్టపడి చదివా. ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్, 72.8 మార్కులు సాధించా. మా నాన్న నాకు ఆదర్శం. –మహబూబాబాద్ అర్బన్

– దేవరకొండ కల్యాణి, బేతోలు, మానుకోట

రోజూ 12 గంటలు చదివా..



మానుకోట జిల్లా గ్రంథాలయంలో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు చదివా. మాది గీత కార్మిక కుటుంబం. నాకు పెళ్లి అయ్యింది. పాప, బాబు ఉన్నారు. మా కుటుంబ పోషణ మా నాన్నగారే చూసుకునే వారు. 7 సంవత్సరాల నుంచి సొంతగా ప్రిపరేషన్ అయి ఉద్యోగం సాధించా. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా డబ్బు లేకపోతే ట్రాక్టర్ అమ్మి కుటుంబాన్ని పోషించుకున్నా. డీఎస్సీ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించా. –మహబూబాబాద్ అర్బన్

– ఐలి వీరేందర్, మోద్గులగూడెం, కురవి మండలం

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చా..



నాన్న వడ్రంగి పని చేసేవాడు. చిన్నప్పటి నుంచి నాకు ఒకటే చెప్పేవారు ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే జీవితంలో ఉన్నతంగా ఉంటామని. తల్లిదండ్రుల కోరిక మేరకు మానుకోటలో గ్రంథాలయంలో రోజూ సన్నద్ధమయ్యా. మా ఇంట్లో నలుగురు ఆడపిల్లలమే. నేను మూడో సంతానం. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతోనే కష్టపడి చదివా. డీఎస్సీ ఫలితాల్లో 31 ర్యాంకు సాధించి తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చా. –మహబూబాబాద్ అర్బన్

– తుపాకుల కావ్య, మోద్గులగూడెం

ఫర్జానా.. ప్రతిభ



దుగ్గొండి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జానా హిందీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ప్రతిభ కనబరిచి 65.67 మార్కులు సాధించింది. ఆత్మకూరు మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న ఫర్జానా.. రెండు నెలల క్రితం వెలువరించిన జేఎల్ ఫలితాలలో స్టేట్ 17వ ర్యాంకు సాధించింది. తాజాగా వెలువరించిన డీఎస్సీ ఫలితాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ప్రతిభ చాటింది. జేఎల్, స్కూల్ అసిస్టెంట్ రెండు పోస్టులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఫర్జానా తెలిపింది. భర్త జమాలుద్దీన్ ప్రోత్సాహంతో ఉన్నత విద్య అభ్యసించానని పేర్కొంది.

నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల వాసుల విజయకేతనం



నిడిగంటి సునీల్



పాడకండ్ల నవీన్

నెల్లికుదురు: స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్ర విభాగంలో ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నిడిగంటి సునీల్ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. అలాగే, నెల్లికుదురు మండల కేంద్రానికి చెదిన పాడకండ్ల నవీన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన చిలుముల ప్రవీణ్ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో (ఎస్జీటీ)లో 6వ రాంకు, అదే గ్రామానికి చెందిన గొడుగు అరుంధతి 7వ ర్యాంకు, ఆలేరుకు చెందిన మహిమూద్ రిజ్వాన ఎస్జీటీలో ర్యాంకు సాధించింది. అలాగే, మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బండారి నరేశ్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు.

ఎస్జీటీలో సౌజన్యకు ములుగు జిల్లాలో 54వ ర్యాంకు



దుర్గం సౌజన్య

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూర్‌కు గ్రామానికి చెందిన దుర్గం సౌజన్య ఎస్జీటీ విభాగంలో ములుగు జిల్లాలో 54వ ర్యాంకు సాధించింది. సౌజన్య తండ్రి సమ్మయ్య చిన్నప్పుడే మృతి చెందగా తల్లి అంకమ్మ అన్ని తానై విద్యాబుద్ధులు చెప్పించింది. సౌజన్య ఒకటి నుంచి 4వ తరగతి వరకు ములుగు ప్రైవేటు పాఠశాలలో, 5నుంచి 10వ తరగతి వరకు జఫర్‌గఢ్‌లోని గురుకుల పాఠశాలలో, ఇంటర్ పర్వతగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పూర్తి చేసింది. కాజీపేట ఫాతిమా కళాశాలలో డీఎడ్ పూర్తి చేసింది.

పట్టుదలతో చదివి..



మూటిక ప్రవళిక

నల్లబెల్లి: నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన మూటిక రాజు రెండో కూతురు ప్రవళిక డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాంధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తన ఆకాంక్షకు అనుగుణంగా పట్టుదలతో చదివింది. డీఎస్సీ పరీక్షకు హాజరై విజయం సాధించింది. కాగా, ప్రవళికను కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

డిస్ట్రిక్ట్ డబుల్ ఫస్ట్ ర్యాంకులు



గోపగోని సంధ్య

దేవరుప్పుల : మండల విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల బోధకురాలు(ఐఈఆర్‌పీ)గా విధులు నిర్వర్తిస్తున్న గోపగోని సంధ్య డీఎస్సీ ఫలితాల్లో రెండు విభాగాల్లో జిల్లా మొదటి ర్యాంకులు సాధించింది. నర్మెట మండల కేంద్రానికి చెందిన సంధ్య ఎస్జీటీ, ఎస్ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్) విభాగాల్లో ర్యాంకులు సాధించడంపై ఎంఈఓ కళావతి, ఎమ్మార్సీ సిబ్బంది రవీందర్ రెడ్డి, నర్సింహులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మహేశ్‌కు ర్యాంకుల పంట..



చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ డీఎస్సీ ఫలితాలలో మూడు వేర్వేరు విభాగాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి, మూడు, ఐదో ర్యాంకులు సాధించాడు. లాంగ్వేజ్ పండిట్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో మూడో ర్యాంకు, సోషల్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించాడు. కాగా, మహేశ్ ప్రస్తుతం మొగుళ్లపల్లి ఎంజేపీలో టీజీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

అభివృద్ధి ప్రతిపాదనలు సమర్పించండి

- అధికారులకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశం
- గ్రేటర్ గ్రీవెన్స్‌కు 76 ఫిర్యాదులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న, అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలపై పలు కాలనీల నుంచి ఫిర్యాదులు అందాయని, ప్రాధాన్యత క్రమంలో వాటి ప్రతిపాదనలు అందజేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్ సెల్‌లో కమిషనర్, వింగ్ అధికారుల సమక్షంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజనీరింగ్ విభాగానికి 21, ప్రజారోగ్యానికి 10, పన్నుల సెక్షన్‌కు 4, టౌన్ ప్లానింగ్‌కు 40, ఎలక్ట్రికల్ సెక్షన్‌కు 1 చొప్పున మొత్తం 76 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్, చంద్ర రాజయ్య, సీఎంహెచ్ఓ రాజేశ్, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ వాడికర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ప్రసన్న రాణి, బయలాజిస్ట్ మాధవరెడ్డి, హెచ్ఓ రమేశ్, డీఎఫ్ఓ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వచ్చిన కొన్ని దరఖాస్తులు..

- భద్రకాళి రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని, కుక్కలు, పందుల సమస్య ఉందని నమిండ్ల మహేష్ కోరారు.
- దేశాయిపేట కెనాల్ నుంచి ఆరెపల్లి వరకు 60ఫీట్ల రోడ్డును అభివృద్ధి చేయాలని, వంద ఫీట్ల రోడ్డుగా విస్తారించాలనే ఫిర్యాదులను పట్టించుకోవద్దని పైడిపల్లి గ్రామస్తులు విన్నవించారు.
- ఆరెపల్లి జాతీయ రహదారిలో నాలాను ఆక్రమించి గోడ నిర్మించడం వల్ల తమ కాలనీల్లోకి వరద నీరు వస్తోందని చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు.
- 11వ డివిజన్‌లోని దళిత శ్మశాన వాటికలో చెత్త డంప్ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఎంఏపీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.
- హంటర్‌రోడ్డులోని ట్యాంక్ బండ్ ప్రధాన రహదారుల్లో టిఫిన్ సెంటర్ల వల్ల వాహనాల పార్కింగ్‌తో తమ ఇళ్లకు పోలేకపోతున్నామని చర్యలు తీసుకోవాలని కోరారు.
- హనుమకొండ స్నేహనగర్‌లో రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు.
- మడికొండ–నెహ్రూ నగర్ మధ్య రోడ్డుపై పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుందని రోడ్డు దెబ్బతింటుందని చర్యలు తీసుకోవాలని విన్నవించారు.
- హంటర్ రోడ్డు 31వ డివిజన్‌లోని ఠాకూర్ కాలనీ ప్రైవేట్ స్కూల్ లైన్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.
- సూర్యోదయ కాలనీలో ఇళ్ల చుట్టూ ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచి దోమలతో జ్వరాల బారిన పడుతున్నామని చర్యలు తీసుకోవాలిన కాలనీవాసులు దరఖాస్తు ఇచ్చారు.
- హంటర్‌రోడ్డు దుర్గాదేవి కాలనీ రోడ్డు నంబరు –1లో, దీన్‌దయాళ్ కాలనీలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కోరారు.
- 51వ డివిజన్‌లో ఇంటింటా చెత్త సేకరణ జరగడం లేదని, డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

సెమీస్‌లో మహబూబ్‌నగర్, నల్లగొండ జట్లు

- కొనసాగుతున్న అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు



సెమీస్‌కు చేరుకున్న మహబూబ్‌నగర్ జట్టుతో క్రికెట్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ కేంద్రంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సోమవారం పూల్ 'ఏ' నుంచి సెమీస్‌కు చేరుకున్నాయి. కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నల్లగొండ స్పిన్ బౌలింగ్ ధాటికి నిర్ణీత 50 ఓవర్లకు గానూ కేవలం 16.5 ఓవర్లను మాత్రమే ఎదుర్కొని 52 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయి చతికిలబడింది. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన నల్లగొండ 9 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 53 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. 3 వికెట్ల తేడాతో నల్లగొండ సెమీ ఫైనల్‌కు చేరుకుంది. మొగిలిచర్ల గ్రౌండ్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గానూ 3 వికెట్ల నష్టానికి 217 భారీ పరుగుల చేసింది. అనంతరం బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లు ఎదుర్కొని 127 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయి ఓటమి ని చవిచూసింది. మహబూబ్‌నగర్ 90 పరుగుల భారీ ఆధిక్యంతో సెమీఫైనల్‌కు చేరుకుంది.

ఓఆర్ఆర్‌పై కారు బోల్తా..

- మహదేవపూర్ మాజీ వైస్ ఎంపీపీ దుర్మరణం



పుష్పలత(ఫైల్)

కాళేశ్వరం: హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై సోమవారం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో మహదేవపూర్ మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత(50) దుర్మరణం చెందారు. పుష్పలత కుమారుడు వి దేశాలకు వెళ్తుండగా ఎయిర్ పోర్టుకు వీడ్కోలు పలికేందుకు వెళ్తున్న క్ర మంలో కారుబోల్తా పడి పుష్పలత మృతి చెందగా, ఆమె మనవరాలు పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు.

సీబీసీ.. రాష్ట్రంలోనే అతి పెద్ద చర్చి

నూతన హంగులతో నేడు ప్రారంభం

- 131 ఏళ్ల చరిత్ర గల క్రిస్టియన్ కాలనీ చర్చి
- రూ.12 కోట్లతో చేపట్టిన నూతన పనులు పూర్తి



ప్రారంభానికి ముస్తాబవుతున్న చర్చి



ఒకేసారి 5 వేల మంది కూర్చుని ప్రార్థనలు చేసేలా నిర్మించిన చర్చి లోపలి భాగం

కాశిబుగ్గ : వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి.. 131 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గల క్రైస్తవుల దివ్యక్షేత్రం. రాష్ట్రంలోనే అతిపెద్దదైన ఈ చర్చి నూతన హంగులు సంతరించుకుని నేడు మంగళవారం ప్రారంభం కానుంది. 8 ఎకరాల సువిశాల స్థలంలో లక్షా 75 వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంది. ఈ చర్చిని 60 ఫీట్ల ఎత్తులో సింగిల్ రూఫ్ ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో జీ+1లో నిర్మించేందుకు 2014లో 5వేల మంది సంఘస్తుల విరాళాలు, రూ.12 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. ఇటీవల నిర్మాణ పూర్తి చేసుకున్న ఈ చర్చిని అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నట్లు చర్చి అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పీఆర్ సాల్మన్, కొల్లూరి రాజ్‌కుమార్, కవిరాజ్ టోని తెలిపారు.

చరిత్ర..

తెలంగాణలో చారిత్రక నేపథ్యం కలిగిన చర్చిలలో వరంగల్ క్రిస్టియన్ కాలనీ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఒకటి. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1893వ సంవత్సరం అక్టోబర్ 1న వరంగల్ మట్టెవాడ ప్రాంతంలో ఈ చర్చిని తొలిసారిగా ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపురం ప్రాంతంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ నిర్మించడానికి అప్పటి నిజాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అక్కడ నివాసం ఉంటున్న క్రైస్తవులకు ప్రస్తుత క్రిస్టియన్‌కాలనీలో 86 ఎకరాల స్థలం కేటాయించి కాలనీ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో చర్చి లేకపోవడంతో వారంతా మామిడి చెట్ల కింద ప్రార్థనలు చేసేవారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న చర్చి కింద ఓ చిన్న చర్చిని నిర్మించుకున్నారు. అనంతరం 1946లో రెవరెండ్ గంధం జేమ్స్ ఆధ్వర్యంలో కె. మాణిక్యం, కెఎం. సాల్మన్, ఎం. సంపోను, జె జోక్స్ హెన్రీ, యాకోబ్, నెల్సన్, ప్రకాశం, కొర్నేలు, ముత్తయ్య, క్రైస్తవ కుటుంబాలు, దాతల సాయంతో 8 ఎకరాల స్థలంలో ఆ చర్చి పక్కన సీబీసీ పెద్ద చర్చి, సెంటినరీ బిల్డింగ్, పాస్టర్ల నివాసాల నిర్మాణ పనులు ప్రారంభించి 1956లో పూర్తి చేశారు. కాలక్రమేణా సంఘస్తులు పెరగడం, చర్చి మహిమతో పెద్ద ఎత్తున దేశ, విదేశాల నుంచి విశ్వాసులు వస్తుండడంతో 2014 అక్టోబర్ 1న అప్పటి పెద్ద పాస్టర్ గంధం జోషి జేమ్స్ పర్యవేక్షణలో చర్చి కమిటీ అధ్యక్షుడు కొల్లూరి రాజ్‌కుమార్, కార్యదర్శి పోలెపాక జాయ్ మనోజ్‌కుమార్, కోశాధికారి టి. బెంజమెన్ ఆధ్వర్యంలో రూ. 6.40 కోట్ల వ్యయంతో మెగా చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ వ్యయం పెరిగి నూతన హంగులతో సంఘస్తులు, దాతల సాయయంతో సుమారు రూ. 12 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిగా సీబీసీ నిర్మాణం పూర్తి చేసుకుని నేడు ప్రారంభానికి సిద్ధమైందని కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో ఒకే సారి 5,500 మంది ప్రార్థనలు చేసుకోవచ్చు. చర్చి నిర్మాణానికి అప్పటి తూర్పు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం నుంచి రూ. కోటి నిధులు కేటాయించగా అందులో రూ. 50 లక్షలు వచ్చాయని తెలిపారు. ఈ చర్చికి అనుబంధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 150 చర్చిలు కొనసాగుతున్నాయి. ఈ చర్చిని రాష్ట్రంలోని ఎంతో మంది నాయకులు సందర్శించారు. వారిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జిల్లాకు చెందిన మంత్రులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, బ్రదర్ అనిల్ సందర్శించి ప్రార్థనలు చేశారు. ప్రస్తుతం చర్చి సీనియర్ పాస్టర్ పుల్లా జగ్జీవన్ బాబ్జీ ఆధ్వర్యంలో నిత్యం ప్రార్థనలు జరుగుతున్నాయి.

సీబీసీ ప్రారంభానికి మంత్రి సురేఖ రూ. 5 లక్షల విరాళం

గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీలో మంగళవారం ప్రారంభం కానున్న సెంటినరీ బాప్టిస్టు చర్చి(సీబీసీ)కి రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ రూ. 5 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం చర్చి ప్రాంగణంలో ఆ నగదును స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకులు ఆయూబ్, నవీన్‌రాజు.. చర్చి కమిటీ అధ్యక్షులు సాల్మన్, కార్యదర్శి రాజకుమార్, పాస్టర్ జగ్జీవన్‌బాబ్జీలకు అందజేశారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో స్వీకరించిన వినతులను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వివిధ సమస్యల వినతులు ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో తహసీల్దార్ కాజీపేట–25, జీడబ్ల్యూఎంసీ–19, ఆర్‌డీఓ హనుమకొండ–12, తహసీల్దార్ హసన్‌పర్తి–10లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 158 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ వై.వి గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు వెంకటేష్, కె.నారాయణ, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్: ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డిలతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ, రెవెన్యూ తదితర సమస్యల దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని, వాటిని త్వరగా పరిష్కరించి ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించేలా పనిచేయాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 103 వినతులు రాగా రెవెన్యూ శాఖ 53, విద్యాశాఖ 6, జీడబ్ల్యూఎంసీ 6, వ్యవసాయ శాఖ 5 దరఖాస్తులు వచ్చాయి.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వృద్ధురాలు

- వరంగల్ 3వ డివిజన్‌లో దేశాయిపేట నుంచి పైడిపల్లి మీదుగా ఆరెపల్లి వరకు నిర్మిస్తున్న రహదారిని 60 ఫీట్ల వెడల్పుతో అభివృద్ధి చేయాలని పైడిపల్లి గ్రామానికి చెందిన మహిళలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- కుటుంబ పోషణకు కులవృత్తి క్షౌ రశాల ఏర్పాటు చేసుకునేందుకు పీఎం విశ్వకర్మ పథకం మంజూరు చేయాలని అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నాగవెల్లి సారంగపాణి కోరారు.